నేటి నుంచి ప్రియాంక గాంధీ పర్యటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ శుక్ర, శనివారాల్లో తెలంగాణలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని టిపిసిసి వర్గాలు తెలిపాయి. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు పాలకుర్తిలో, 1.30 గంటలకు హుస్నాబాద్, సాయంత్రం 3 గంటలకు కొత్తగూడెం ప్రచార సభలో ప్రియాంక పాల్గొంటారు. కొత్తగూడెంలో సిపిఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావుకు మద్దతుగా ఆమె ప్రచారం నిర్వహిస్తారు. 24వ తేదీ రాత్రి ఖమ్మంలోనే బస చేస్తారు. 25న ఉదయం 11 గంటలకు పాలేరు, 1.30 గంటలకు సత్తుపల్లి, 2.40 గంటలకు మధిర ప్రచార సభల్లో ప్రియాంక పాల్గొంటారు. అనంతరం విజయవాడ చేరుకుని గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ఢిల్లీకి వెళ్తారు.

ఎన్నికల నిర్వహణకు చురుగ్గా ఏర్పాట్లు

- 35,635 పోలింగ్ కేంద్రాలు
- 86 శాతం ఓటర్ స్లిప్పుల పంపిణీ
- పోలింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత
- సిఇఒ వికాస్ రాజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్ రాజ్ తెలిపారు. బిఆర్‌కె భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 32,602,799 ఓటర్లు ఉన్నారని, అందులో ఇప్పటి వరకు 86 శాతం మందికి ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయిందని, మిగతా వారికి రెండు రోజుల్లో పూర్తి చేయనున్నట్టు వెల్లడించారు. ఓటరు స్లిప్పులతోపాటు ఓటు ఏలా వేయాలో తెలిపే ఓటర్ గైడ్ బుక్‌లెట్, ఫిర్యాదులు ఎలా చేయాలనే సమాచారంతో కూడిన సి విజిల్ కరపత్రాలను అందజేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 35,635 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు రాష్ట్ర పోలీసులతోపాటు 377 కంపెనీల కేంద్ర బలగాలను ఉపయోగిస్తున్నట్టు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. జిల్లా స్థాయిలో 67 మంది సాధారణ పరిశీలకులు, 39 పోలీస్ అబ్జర్వర్స్, 60 మంది వ్యయ పరిశీలకులను కేంద్ర ఎన్నికల సంఘం నియమించిందని తెలిపారు. వీరితోపాటు ప్రతి నియోజకవర్గానికి ఒక అబ్జర్వర్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. పోలింగ్ కోసం 72,931 బ్యాలెట్ యూనిట్లు, 56,592 కంట్రోల్ యూనిట్లను అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఈ నెల 29న పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రానికి చేరుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. మూడు కేటగిరీల వారికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కల్పించామని తెలిపారు. 80 ప్లస్ ఉన్న వారు 9,386, పిడబ్ల్యూ కేటగిరిలో 5,022 మంది, అత్యవసర సర్వీసులకు చెందిన వారు 253 మంది ఇప్పటి వరకు ఓటు హక్కు వినియోగించుకున్నట్టు తెలిపారు. ఈ సారి ఎన్నికల్లో 19.9 లక్షల మంది యంగ్ ఓటర్లు, 5 లక్షల మంది సీనియర్ సిటిజన్స్ ఈసారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. కొత్తగా 51 లక్షల ఓటర్ కార్డులు ముద్రించి పంపిణీ చేసినట్టు తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల వద్ద కావాల్సిన అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా రూ.669 కోట్ల నగదు, బంగారం, లిక్కర్, మత్తు పదార్థాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకుని, 10,116 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో పోలింగ్ శాతం పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

గచ్చిబౌలి పరిధిలో రూ.ఐదు కోట్లు పట్టివేత ముగ్గురు అరెస్ట్

రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలి పోలీసుస్టేషన్‌లో పరిధిలో అక్రమంగా తరలిస్తున్న రూ.ఐదు కోట్ల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేశారు. గచ్చిబౌలి సిఐ జాన్సన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల తనిఖీల్లో భాగంగా కొండాపూర్ బొటానికల్ గార్డెన్ రోడ్‌లోని గచ్చిబౌలిలో పోలీసులు వాహనాల తనిఖీల్లో భాగంగా.. ఆటుగా వచ్చిన మారుతి బ్రీజా కారును పోలీసులు తనిఖీ చేశారు. ఆ కారులో రూ.ఐదు కోట్ల నగదును గుర్తించారు. డబ్బు తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులు దుగయ్య సంతోష్‌రావు, ముత్యాల నరేష్, చీటి సంపత్ రావును డబ్బు వివరాలను అడిగి విచారించారు. కాగా, వాటికి సంబంధించిన ఎలాంటి పత్రాలు చూపించకపోవడంతో ఆ డబ్బును సీజ్ చేసి వారిని అరెస్ట్ చేశారు. డబ్బును ఐటీ శాఖ అధికారులకు అప్పగించారు. కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్టు సిఐ తెలిపారు.

నియోజకవర్గంపై పూర్తి అవగాహన ఉంది

- సమగ్ర అభివృద్ధే ధ్యేయం..
- అశ్వారావుపేట సిపిఎం అభ్యర్థి అర్జున్‌రావు పిట్టల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పలు కార్మిక సంఘాలకు నేతృత్వం వహిస్తున్న నాయకుడిగా, సామాజిక అవగాహన, నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలపై పూర్తి అవగాహన ఉందంటున్నారు అశ్వారావుపేట సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి అర్జున్ రావు పిట్టల. నియోజకవర్గ సామగ్రాభివృద్ధే లక్ష్యంగా ఈ ఎన్నికల్లో నిలిచినట్టు, తనను గెలిపిస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. "గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు పూర్తి స్థాయిలో నేటి వరకు అందలేదు. వ్యవసాయానికి సాగునీటి సమస్య, రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. పామాయిల్ సాగు విస్తారంగా చేపడుతున్న రైతులకు గిట్టుబాటు ధరలు అందడం లేదు. వసతి గృహాల్లో, ఆశ్రమ పాఠశాలల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్కీం వర్కర్లు, సంఘటిత రంగ కార్మికులకు కష్టానికి తగిన వేతనాలు లేవు. పేద కుటుంబాలకు రేషన్ కార్డుల సమస్య ఉంది. యువతకు ఉద్యోగాల కల్పన లేదు.ఉపాధి హామీ చట్టం ద్వారా అర్హులైన వారికి తగిన పని దినాలు కల్పించడంలో, చేసిన పనికి కూలీ డబ్బులు సరైన సమయంలో చెల్లించడంలో వైఫల్యం ఉందని ఆయన స్థానిక సమస్యలను వివరించారు.వాటి పరిష్కారానికి నన్ను గెలిపిస్తే అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాను. ప్రజలను సమీకరించి ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేందుకు పోరాటాలు ఉధృతం చేస్తానన్నారు.

మతోన్మాద శక్తులను ఓడించాలి

- 'కుంభకోణాల' కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే హక్కు లేదు
- మాయమాటలతో మోసం చేస్తున్న బిఆర్ఎస్
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

దేశంలో రాజ్యాంగాన్ని, లౌకికతత్వాన్ని ధ్వంసం చేస్తూ కుల, మతాల పేరుతో ప్రజలపై దాడి చేస్తున్న మతోన్మాద బిజెపిని ఓడించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న సిపిఎం జనగామ అభ్యర్థి మోకు కనకారెడ్డికి అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. సిద్దిపేట జిల్లా చేర్యాలలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్ అధ్యక్షతన గురువారం జరిగిన ఆ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ పేదలపై భారాలు వేస్తున్న బిజెపికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. దేశం అత్యంత పేదరికంలో కూరుకుపోవడానికి, అనేక కుంభకోణాలు చేసి దేశాన్ని దివాళా తీయించిన కాంగ్రెస్‌కు ప్రజలను ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చి పదేండ్లు అయినా, ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని అమలు చేయకుండా ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేస్తోందని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. నిరుద్యోగ సమస్య పెరిగిపోయి యువత భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆరోపించారు. పేదలకు ఇచ్చిన హామీలైన ఇంటికో ఉద్యోగం, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, కేజీ నుంచి పీజీ ఉచిత విద్య, దళితులకు మూడు ఎకరాల భూమి, ప్రతి ఎకరాకు సాగునీరందిస్తానని అనేక ప్రగల్భాలు పలికిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు, కష్టజీవుల హక్కులు, అన్ని వర్గాల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజా ఉద్యమాలే ఊపిరిగా వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోరాడుతున్న సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, శెట్టిపల్లి సత్తిరెడ్డి, సందబోయిన ఎల్లయ్య, మండల కార్యదర్శులు కొంగరి వెంకట మాఒ, ఆలేటి యాదగిరి, చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు, రామ్‌సాగర్ సర్పంచ్ తాడూరి రవీందర్, సిద్దిపేట, జనగామ జిల్లా కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక రాష్ట్రం ఒక్కరితోనే రాలేదు

- తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు కోదండరాం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో బిఆర్ఎస్ ప్రభుత్వం వనరుల దోపిడీకి పాల్పడుతూ సహజ వనరులను విధ్వంసం చేస్తున్నదని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. గురువారం కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కేవలం కెసిఆర్ ఒక్కరితోనే రాలేదని, యావత్ తెలంగాణ ప్రజలంతా కలిసి పోరాడితేనే వచ్చిందన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను సోనియా గాంధీ నెరవేర్చారని తెలిపారు. మిగులు రాష్ట్రాన్ని కెసిఆర్ అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. దళిత బంధు, బిసి బంధు, మైనార్టీ బంధు కేవలం కాగితాలకే పరిమితమైందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడంలో బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఫలితంగా నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇంకా రెండు లక్షల ఉద్యోగ ఖాళీలు ఉన్నాయన్నారు. నిరుద్యోగ సమస్య యువతను శక్తిహీనులను చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను ఇంజినీర్లు కాకుండా కెసిఆర్ కట్టిండు కాబట్టే దస్కీ పోయిందన్నారు. లిక్కర్ కేసులో కవితను బిజెపి ప్రభుత్వం ఎందుకు అరెస్టు చేయలేదో చెప్పాలన్నారు. బిఆర్ఎస్, బిజెపి ఒకటేనన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన పథకాలతో తెలంగాణ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రజాస్వామిక తెలంగాణ ఏర్పాటుకు రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని, నిరంకుశ పాలనను అంతమొందించి.. అసమానతలు లేని తెలంగాణ ఏర్పాటు కోసమే కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. హుజురాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ప్రణవ్‌బాబును గెలిపించాలని ప్రజలను కోరారు.

నేటి నుంచి సిపిఎం జాతీయ నాయకుల రాష్ట్ర పర్యటన

- మూడు రోజులు త్రిపుర మాజీ సిఎం మాణిక్‌సర్కార్ ఎన్నికల ప్రచారం
- నేడు జనగామ, హైదరాబాద్‌కు సుభాషిణీ అలీ రాక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రచారానికి సంబంధించి సిపిఎం జాతీయ నాయకుల పర్యటన ఖరారైంది. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ మూడ్రోజులపాటు రాష్ట్రంలో పర్యటించనున్నారు. శుక్రవారం ఖమ్మంలో రోడ్ షోలో ఆయన పాల్గొంటారు. అదేరోజు మధిర నియోజకవర్గం ముదిగొండలో నిర్వహించే సభకు హాజరవుతారు. ఈ నెల 25న శనివారం భద్రాచలం నియోజకవర్గంలోని వాజేడులో పర్యటిస్తారు. అదే రోజు సాయంత్రం భద్రాచలం పట్టణంలో రోడ్‌షోలో పాల్గొంటారు. ఈ నెల 26న ఆదివారం పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచిలో జరిగే సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరవుతారు. శుక్రవారం సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు సుభాషినీ ఆలీ రాష్ట్ర పర్యటనకు వస్తున్నారు. జనగామ నియోజకవర్గంలో ఆమె పర్యటిస్తారు. అదేరోజు సాయంత్రం హైదరాబాద్ లోని ముషీరాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు.

మొగులు.. గుబులు..

- కొనుగోలు కేంద్రాల్లో కుప్పలు తెప్పలుగా
- కరీంనగర్ జిల్లాలో కొనుగోలు లక్ష్యం 4.5 లక్షల మెట్రిక్ టన్నులు
- ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం లక్ష మెట్రిక్ టన్నులు
- ప్యాడీ సెంటర్ల వద్ద ఆందోళనలో రైతాంగం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ వానాకాలం రైతాంగానికి కలిసొచ్చింది. సాగు ప్రారంభంలో కొంత వర్షాభావ పరిస్థితులు వెంటాడినా తీరా జులై, ఆగస్టు చివరి వారం వరకు కురిసిన భారీ వర్షాల తరువాతనే నాట్లు ముమ్మరమయ్యాయి. ఎకరాకు 35 నుంచి 40 బస్తాలపైనే ధాన్యం దిగుబడి రావడంతో రైతులంతా సంతోషించారు. తీరా కోత సమయానికి ఎన్నికలు రావడంతో అధికారులంతా ఎలక్షన్ ఏర్పాట్ల చుట్టే తిరిగారు. దాంతో తీరిగ్గా గత నెల 26న ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్లు సంబంధిత అధికారులతో ధాన్యం సేకరణపై ప్రణాళికలు రూపొందించారు. దాంతో నవంబర్ మొదటివారం తరువాతనే ప్యాడీ సెంటర్లు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం కోతలన్నీ పూర్తయి ధాన్యమంతా కల్లాలు, ప్యాడీ సెంటర్లలో ఆరబెట్టుకోగా.. గురువారం సాయంత్రం నుంచి వాతావరణం చల్లబడి అక్కడక్కడా జల్లులు పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కరీంనగర్ జిల్లాలో 335 ధాన్యం కేంద్రాలకు 332 కేంద్రాలను ప్రారంభించారు. 321 కేంద్రాల్లో ధాన్యం సేకరిస్తున్నారు. ఇందులో ఐకెపి 50, పిఎసిఎస్ 233, డీసీఎమ్ఎస్ 49, హెచ్ఎసిఎ 3 కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల ద్వారా 16,221 మంది రైతుల నుంచి బుధవారం వరకు 97,523మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. గురువారం 9276 మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ప్రస్తుతం జిల్లాలో వానాకాలం సీజన్ పంటంతా కోత పూర్తయింది. ధాన్యం రాశులన్నీ కల్లాలు, ప్యాడీ సెంటర్లలో ఆరబోసి ఉన్నాయి. ఈ పది రోజుల కాలంలో ప్రారంభించిన కొనుగోలు కేంద్రాల ద్వారా కేవలం 16,221 మంది రైతుల నుంచి 97,523 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే ప్రభుత్వం సేకరించింది. మిగతా సుమారు 3.5లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం అంతా ఆరబోసి ఉంది.

కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమే: కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ఆగమవుతామని, నల్లగొండ జిల్లాలో ఫ్లోరోసిస్‌తో ప్రజలు ఆగమయ్యారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కెటిఆర్ అన్నారు. తెలంగాణకున్న ఒకే ఒక గొంతు కెసిఆర్ అని, ఆయన్ను తెలంగాణ దాటి రాకుండా చూసుకోవాలన్నదే రాహుల్ గాంధీ, మోడీ కుట్ర అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్, నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గాల్లో నిర్వహించిన రోడ్ షోల్లో కెటిఆర్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ఒక్క ఛాన్స్ ఇవ్వాలని అడుగుతుందని, ఒక్క ఛాన్స్ కాదు 11 ఛాన్సులు ఇచ్చిన జిల్లాలో ఫ్లోరోసిస్, సాగు, తాగునీటి సమస్యను పరిష్కరించలేదన్నారు. తొమ్మిదేండ్ల బిఆర్ఎస్ పాలనలో రూ.12వేల కోట్లతో ప్రాజెక్టుల నిర్మాణం, జిల్లాలో ఫ్లోరోసిస్ నిర్మూలన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. అసైన్డ్ భూమి పట్టాదారులకు హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, లిఫ్టులు పూర్తి కావాలంటే కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

హుజుర్‌నగర్‌లో ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన ఉత్తమ్ కుమార్ రెడ్డి చేయలేని అభివృద్ధిని ఎమ్మెల్యే సైదిరెడ్డి చేశారని కెటిఆర్ అన్నారు. నూతన ఆర్‌డిఒ, ఈఎస్ఐ ఆస్పత్రి, నేరేడుచర్లను నూతన మున్సిపాలిటీగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆయకట్టు చివరి భూములకు నీరు అందాలనే ఆలోచనతో రూ.1770 కోట్లతో ముత్యాల బ్రాంచ్ జాన్‌పహాడ్ లిఫ్టులను నూతనంగా ఏర్పాటు చేశామన్నారు. ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఏర్పాటుచేసిన లిఫ్టులు చాలావరకు మరమ్మతులకు నోచుకోకపోవడంతో తిరిగి ఆ లిఫ్టును మరమ్మతు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

సిఎంఆర్ బియ్యం డిసెంబర్ 31 వరకు అందించాలి

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జిల్లాలో 2022-23 రబీ, ఖరీఫ్ సంవత్సరానికి సంబంధించిన సిఎంఆర్ బియ్యాన్ని సంబంధిత మిల్లర్లు డిసెంబర్ 31వ తేదీ నాటికి అందించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ అనిల్ కుమార్ అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ నందు జిల్లాలోని మిల్లర్లు, సంబంధిత శాఖ అధికారులతో గత ఖరీఫ్, రబీ, 2022 -23 సిఎంఆర్ బియ్యంపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావుతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. గత ఖరీఫ్, రబీ 2022-23 ఏడాదిలో.. నాగర్ కర్నూల్ జిల్లాలో 109 మిల్లులకు 2,99,663 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం అందించినట్టు తెలిపారు. మిల్లుల నుంచి 2,15,098 మెట్రిక్ టన్నుల సిఎంఆర్ బియ్యం ఎఫ్‌సిఐకి అందించాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 23 శాతం అంటే 45,645 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే అందించి రాష్ట్రంలో జిల్లా చివరి స్థానంలో ఉందని మిల్లర్లపై అసహనం వ్యక్తం చేశారు. డిసెంబర్ 31 నాటికి 1,55,953 మెట్రిక్ టన్నుల సిఎంఆర్ బియ్యాన్ని అందించాలని ఆదేశించారు. మిల్లర్లు సిఎంఆర్ బియ్యానికి సంబంధించి వ్యయపట్టికలు సరిచూసుకోవాలని, ఎప్పటికప్పుడు సంబంధిత నివేదికలను కార్యాలయంలో అందించాలని తెలిపారు. అదేవిధంగా 2021 రబీకి సంబంధించి 6,900 మెట్రిక్ టన్నుల సిఎంఆర్ బియ్యం కూడా ఇప్పటి వరకు ఎఫ్‌సిఐకి పెట్టని మిల్లులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, ఎఫ్‌సిఐ నుంచి 20 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ తీసుకునేందుకు అనుమతిచ్చిందన్నారు. అనంతరం నెల్లికొండలోని సత్యసాయి బాయిల్డ్ రైస్ మిల్లును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులో ఉన్న వరి ధాన్యం, బియ్యం విలువలను పరిశీలించారు. సమావేశంలో డీఎస్ఓ స్వామి, సివిల్ సప్లై డీఎం బాల్‌రాజ్, రాజేందర్, జిల్లా మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి రవి, నవీన్, హకీం రాజేష్ ,ప్రతాపరెడ్డి మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

మత కల్లోలాలతోనే బిజెపి పబ్బం

- కాంగ్రెస్‌ది.. భూమాత కాదు.. భూ'మేత'
- కరెంట్‌లో కోతలంటే.. రైతులకు ఎనకటి గతే
- మేం వంట చేస్తే.. వారు వడ్డిస్తరట..
- మోసగాళ్ల మాటల వింటే.. మోసపోతాం
- ప్రజా ఆశీర్వాద సభల్లో సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మత కల్లోలాలను సృష్టిస్తూ బిజెపి రాజకీయ లబ్ది పొందాలని చూస్తోందని, ప్రజలు ఆ పార్టీని దేశం నుంచి తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయ ని సిఎం కెసిఆర్ అన్నారు. తాను బతికున్నంత కాలం తెలంగాణలో సెక్యులర్ పాలనే కొనసాగుతుందని స్పష్టం చేశారు. తనకు హిందూ ముస్లింలు రెండు కళ్లలాంటివారన్నారు. కాంగ్రెసోళ్లు ధరణిని తీసి పెట్టేది..భూమాత కాదు..భూ 'మేత' అని విమర్శించా రు.తెలంగాణ తెచ్చింది..24 గంటల కరెంటు ఇచ్చింది.. ఇంటింటికీ మంచినీళ్లు తెచ్చింది.. కెసిఆర్‌ఆరేనని తెలిపారు. "ఎనుకటికీ ఎవరో అన్నర ట.. మీరు మొత్తం వంటలు చేసి తయారు పెట్టుంద్రు.. యాళ్లకు నేనొచ్చి వడ్డిస్తానని.." కాంగ్రెసోళ్ల పరిస్థితి ఇప్పుడు అట్లుందని సిఎం కెసిఆర్ ఎద్దేవా చేశారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మహేశ్వ రం, వికారాబాద్, జహీరాబాద్, పటాన్ చెరు నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో ఆయన మాట్లాడారు.

జహీరాబాద్‌కు మాజీమంత్రి మహమ్మద్ ఫరిదోద్దీన్ సేవలు ఎనలేనివని కొనియాడారు. ఆయన తనకు కుటుంబ మిత్రుడని..అందుకే అతని కుమారుడిని ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మెన్‌గా నియమించామన్నారు. ఇప్పటికే జహీరా బాద్‌ను అన్ని విధాల అభివృద్ధి చేశామన్నారు. మైనారిటీల సంక్షేమానికి రూ.12 వేల కోట్లతో వివిధ సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. జహీరాబాద్ ప్రాంతంలోని చాలామందికి కర్నాటక నుంచి బంధుత్వాలు ఉంటాయి కనుక.. అక్కడి పాలనకు, ఇక్కడి పాలనకు బేరీజు వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నారింజ ప్రాజెక్ట్ అభివృద్ధి, సంగమేశ్వర ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు లక్ష ఎకరాలకు పైగా సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. పటాన్‌చెరు ప్రాంతానికి మెట్రోరైలు వస్తుందన్నారు.

భూదేవంత ఓపిక ఉన్న నేత.. సబిత

మహేశ్వరం, వికారాబాద్‌లలో జరిగిన సభల్లో కెసిఆర్ మాట్లాడుతూ.. ప్రతి రోజు మంత్రి సబితమ్మ ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కృషి చేస్తున్నారని, భూదేవికి ఉన్నంత ఓపిక ఆమెకు ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పిదాల వల్లే భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమ య్యాయని, ఆ సమస్య పరిష్కారం కోసం వంద కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేయించి ఎస్ఎన్‌డీపీ నిధులతో నాలాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కోట్లాది రూపాయలతో చెరువుల అభివృద్ధి పనులను చేపట్టడంతో పాటు ఇంటింటికీ తాగునీటిని అందించినట్టు చెప్పారు. మంత్రి కృషితోనే కందుకూర్‌లో మెడికల్, లా జూనియర్, డిగ్రీ కళాశాలలు, గురుకుల పాఠశా లలు, కోట్లాది రూపాయల ప్రత్యేక నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. పాక్స్‌ఖాన్ కంపెనీ ఏర్పాటుతో లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు ఉంటా యన్నారు. తెలంగాణ రాష్ట్రం మనకైంది.. మన పైసలు మన దగ్గరే ఉంటున్నయి కాబట్టి అభివృద్ధి అంతా సాధ్యమైతావుందని తెలిపారు. రైతుల భూము లు అన్యాక్రాంతం కావొద్దని, ఎవరు పడితే వారు పేర్లు మార్చొద్దని ధరణిని తెచ్చామన్నారు. ఎవరి చేతుల్లో ఈ రాష్ట్రం ఉంటే మంచిదని ఆలోచించి వజ్రాయుధం లాంటి ఓటును సద్వినియోగం చేసు కుంటేనే మన భవిష్యత్తు బాగుంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీలను ఎప్పుడూ ఓటు బ్యాంకుగానే చూసిందన్నా రు. గత కాంగ్రెస్ పదేళ్లలో మైనార్టీల కోసం రూ.2000 కోట్లను మాత్రమే ఖర్చు చేస్తే.. బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో రూ.12,000 కోట్లు ఖర్చు చేసిందన్నారు.

భూ బకాసురుడు సిఎం కెసిఆర్

- చర్లపల్లి జైల్లో కెసిఆర్‌కు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టిస్తాం
- మామ, అల్లుళ్లు కలిసే దుబ్బాకను దోచుకున్నారు
- ఈటల తట్టెడు మట్టి పోసాడా?
- ఎన్నికల సభల్లో టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'కెసిఆర్ బక్కోడు కాదు.. బకాసూరుడు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం. తాము అధికారంలోకి వస్తే కెసిఆర్‌ను చెర్లపల్లి జైలుకు పంపిస్తాం. అందులోనే కెసిఆర్‌కు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కట్టిస్తాం' అని టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి అన్నారు. పదేళ్లలో సిఎం కెసిఆర్ అవినీతి అక్రమాలతో సంపాదించుకున్న వెయ్యి కోట్ల రూపాయలను జైల్‌లో వేసి కక్కిస్తామని తెలిపారు. చర్లపల్లి జైల్లోకి వెళ్లే కెసిఆర్‌తో పాటు కెటిఆర్, కవిత, హరీశ్‌రావులకు చోటు ఉంటుం దని జోస్యం చెప్పారు. గురువారం సిద్దిపేట జిల్లా దుబ్బాక, కరీంనగర్ జిల్లా హుజూరాబాద్, హైదరాబాద్‌లోని ముషీరాబాద్ నియోజకవరా ల్లో జరిగిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సభల్లో రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. దుబ్బాక అంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నేటి తెలంగాణ వరకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే దుబ్బాకకు రావాల్సిన నిధులు సిద్దిపేటకు తీసుకువెళ్లున్నప్పుడు ముత్యంరెడ్డి హయాంలోనే తిరిగి దుబ్బాకకు నిధులు సమకూర్చి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశాడని గుర్తుచేశారు. బిజెపి, బిఆర్ఎస్ తామంటే తాము చేశామని చెప్పుకుంటూ నేడు దుబ్బాక ప్రజల ఓట్ల కోసం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో కెసిఆర్ ను బొంద పెడితే రూ.4000 పింఛన్ ఇస్తామన్నారు. పదేళ్లలో కెసిఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, పైగా వెయ్యి ఎకరాల్లో ఫామ్ హౌజ్, పంజాగుట్టలో 15 వందల ఇళ్లు కట్టుకున్నాడని ఆరోపించారు. మల్లన్న సాగర్ బాధితులకు, ఈ ప్రాంత రైతుల సమస్యల మీద సుప్రీంకోర్టు వరకు కొట్లాడింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేశారు. దుబ్బాకను రెవెన్యూ డివిజన్, పీజీ కాలేజ్, చేనేత కార్మికులకు పవర్ లూమ్స్ తీసుకొస్తామని, కెసిఆర్ చదివిన కామారెడ్డిలో చేనేత కార్మికుడికి ఇల్లు ఇవ్వలేదని అన్నారు.

ఈటల రాజేందర్ తట్టెడు మట్టి పోసాడా

కరీంనగర్ జిల్లా జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన సభలో రేవంత్ మాట్లాడుతూ.. హుజూరాబాద్ గడ్డ మీద కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని తనతో పాటు కోదండరామ్, బల్మూరు వెంకట్ వచ్చారని చెప్పారు. ఇవి ఆశామాషీ ఎన్నికలు కాదని.. రాజరికపు పాలన ఉండాలా వద్దా అనే అంశాన్ని తెల్చనున్న ఎన్నికలని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అంటే దేశ మాజీ ప్రధాని పివి జిల్లా అని గుర్తుచేసుకున్నారు. దొంగ ఏడ్పు ఏడ్చి గెలిచిన ఈటల రాజేందర్.. కేంద్ర ప్రభుత్వం నుంచి ఏమైనా నిధులు తెచ్చారా అని ప్రశ్నించారు. బిఆర్ఎస్, బిజెపి దొందు దొందేనని ఆరోపించారు. ఈటల రాజేందర్ ఉప ఎన్నికల్లో గెలిచిన తర్వాత తట్టెడు మట్టి కూడా పోయలేదని విమర్శించారు. ఏడుసార్లు ఈటలను గెలిపించి నా హుజురాబాద్ వద్దనుకొని, గజ్వేల్‌కు పోయిం డని అన్నారు. 30లక్షల మంది నిరుద్యోగులు ఈ కురుక్షేత్రంలో ముందు ఉన్నారని.. కేసీఆర్ ప్రభుత్వాన్ని బొంద పెట్టాలన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో అంజన్ కీలక పాత్ర

హైదరాబాద్ ముషీరాబాద్‌లోని కవాడిగూడ డివిజన్ కట్ట మైసమ్మ దేవాలయం వద్ద నుంచి గాంధీనగర్, బోలక్‌పూర్, సాగర్ లాల్ హాస్పిటల్, ఫిష్ మార్కెట్, రాంనగర్ చౌరస్తా వరకు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రేవంత్ రోడ్‌షో నిర్వహించారు. అనంతరం రామ్‌నగర్ చౌరస్తా వద్ద ఆయన మాట్లాడుతూ.. ముషీరాబాద్ నియోజక వర్గంలో ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అండగా ఉండే వ్యక్తి అంజన్ కుమార్ యాదవ్ అని అన్నారు. కాంగ్రెస్‌ను ఆశీర్వదించేందుకు ముషీ రాబాద్ ప్రజలే కాదు. వరుణ దేవుడు కూడా వచ్చాడు అని తెలిపారు. రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆయన కీలకపాత్ర పోషిస్తారని హామీ ఇచ్చారు.

స్థిరమైన ప్రభుత్వంతోనే సమగ్రాభివృద్ధి

- తెలంగాణలో కాంగ్రెస్‌కు బేస్ లేదు
- బిజెపిని అడ్డుకుంది ప్రాంతీయ పార్టీల నేతలే..
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ దళారీవ్యవస్థే : కెటిఆర్
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో స్థిరమైన ప్రభుత్వం ఉంటేనే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ , మంత్రి కెటిఆర్ అన్నారు. ఇక్కడ ప్రజలు కోరుకుంటున్నది స్థిరమైన ప్రభుత్వం అని చెప్పారు. పెట్టుబడులు రావాలంటే శాంతిభద్రతలు బాగుండాలనీ, దృఢచిత్తమైన, నిర్ణయాత్మకంగా వ్యవహరించే నాయకత్వం ఉంటేనే అది సాధ్యమవుతుందని చెప్పారు. కాంగ్రెస్ కేవలం రెండో స్థానం కోసం మాత్రమే పోటీ పడుతోందనీ, ఆ పార్టీకి ఇక్కడ బేస్ లేదన్నారు. హైదరాబాద్‌లోని ఓ హెూటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ అభివృద్ధిపై కెటిఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

దేశంలో పలు రాష్ట్రాల్లో స్ట్రాంగ్ రీజినల్ లీడర్స్ ఉన్న పార్టీలే గెలుస్తున్నాయని కెటిఆర్ తెలిపారు. బిజెపిని నిలువరించింది కూడా మమతా బెనర్జీ, కేజ్రీవాల్, కేసీఆర్, స్టాలిన్ తప్ప కాంగ్రెస్ కాదని పేర్కొన్నారు. కర్ణాటకలో చూస్తే.. అప్పుడే కీచులాటలు మొదలయ్యాయి. అక్కడ సిద్ధరామయ్య ముఖ్యమంత్రి అయ్యి మూడు, నాలుగు నెలలు అయ్యింది అంతే. అప్పుడే డీకే శివకుమార్ వెనుక నుంచి గోతులు తవ్వుతున్నారు. ప్రియాంక ఖర్గే కత్తులు దూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ గత 40 ఏళ్లలో తెలంగాణలో ఏ ఒక్క ఎన్నికల్లోనూ 56 -57 సీట్లు దాటి గెలిచిందిలేదన్నారు.

'కర్ణాటక ఎన్నిక తర్వాత బిజెపి అంతో ఇంతో ఎగురతా ఉండిందో ఆ గాలి ఒక్కసారిగా దిగింది. అందులోంచి కొంత కాంగ్రెస్‌వైపు మళ్లింది. బిఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం మేమే అని రెండో స్థానం కోసం బిజెపి కొట్లాడిందో ఇప్పుడా ప్లేస్‌ను కాంగ్రెస్ తీసుకుంది. నంబర్ వన్ ప్లేస్ మాత్రం పదిలంగా కేసీఆర్ చేతిలో.. బిఆర్ఎస్ చేతిలోనే ఉంది. కర్ణాటకలో మూడేండ్ల కిందటనే అక్కడి ఫలితాలు డిసైడ్ అయ్యాయి. ఎందుకంటే 40 శాతం కమీషన్లు అని కాంట్రాక్టర్లే ఆరోపణలు చేయడం.. 40 శాతం కమీషన్ అని అక్కడి ప్రైవేటు విద్యా సంస్థలు ఆరోపణలు చేయడం, స్పష్టంగా ప్రధాన మంత్రికి ఉత్తరాలు రాయడం.. మఠాలు కూడా 30 శాతం కమీషన్ ఇవ్వకుంటే నిధులు రావట్లేదని నేరుగా ప్రధాన మంత్రికి లేఖలు రాయడం ఇదంతా కూడా జరగడం వల్ల.. కర్ణాటకలో ప్రభళమైన అసంతృప్తి వెళ్లూనుకుంది. అక్కడ నిజంగా కాంగ్రెస్ గెలిచిందేం లేదు. చేజేతులా బిజెపి అధికారాన్ని పారేసుకుంది. ఇక్కడ తెలంగాణలో చూస్తే పదేండ్ల తర్వాత కొంత అసంతృప్తి ఉంటుంది. ఏ రూపంలో అంటే కొత్త రేషన్ కార్డులు రాలేదనో.. కొత్త ఫించన్లు రాలేదనో ఉంది. ఇవాళ మా ప్రత్యర్థులు చూస్తే ఎక్కడ కూడా ప్రజల అంశాలు మాట్లాడట్లేదు. తెలంగాణలో ప్రజలకు తాగునీరు రావట్లేదని మాట్లాడే పరిస్థితి లేదు. కేసీఆర్ ఆ పని పూర్తి చేశారు. సాగునీరు రావట్లేదని అనే పరిస్థితి లేదు. ఎందుకంటే ప్రాజెక్టులు పూర్తయినయ్. ఇబ్బడిముబ్బడిగా

పంటలు పండుతున్నయ్. మా ప్రత్యర్థులు రోడ్ల మీదకు పోతుంటే ఎక్కడికక్కడ పుట్లకు పుట్లు వడ్లు కనపడుతున్నయ్. కరెంట్ రావడం లేదు అనడానికి లేదు. అనడానికి మౌళిక అంశాలు లేవు. అందుకే ప్రచారంలో ఏం చెబుతున్నారంటే.. అహంకారం.. దొరలు కావాలా ప్రజలు కావాలా ? మార్పు కావాలి.. అని అంటున్నారు' అని కెటిఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధరణిని ఎత్తేసి, పట్వారీ వ్యవస్థను తీసుకొస్తారని చెప్పారు. పట్వారీ వ్యవస్థ అంటేనే దళారీ వ్యవస్థ అని తెలిపారు. గతంలో తెలంగాణలో ఒక రైతు భూమి రిజిస్ట్రేషన్ కావాలంటే చేయి తడపనిదే రిజిస్ట్రేషన్ అయ్యేది కాదు. అంతేకాదు ఎప్పుడు రిజిస్ట్రేషన్ అవుతదో, మ్యుటేషన్ ఎప్పుడు అయితదో తెలవని పరిస్థితి. మన చేతుల్లో ఏం ఉండేది కాదు. వాళ్ల దయ మన ప్రాప్తం. ధరణి వచ్చిన తర్వాత అన్ని లేయర్స్ పోయాయని అన్నారు. పట్వారీ వ్యవస్థను తీసుకొచ్చిన వారిని ఆశీర్వదిద్దామా.? లేదా ధరణి తెచ్చి, భూముల రిజిస్ట్రేషన్‌లో పారదర్శకత తెచ్చిన వారిని ఆశీర్వదిద్దామా ప్రజలు ఆలోచించాలి అని కెటిఆర్ ప్రజలను కోరారు.

ఇల్లందుకు పూర్వవైభవం తెస్తా

- గాంధీనగర్-ఇల్లందు రైల్వే లైన్‌కు ప్రయత్నిస్తా..
- సిపిఎం అభ్యర్థి దుగ్గి కృష్ణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మొక్కలు, పార్కులు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, రోడ్లు, డివైడర్లు.. లాంటి పనులు చేస్తూ రూ.కోట్లలో అభివృద్ధి చేశామని చెబుతుంది బిఆర్ఎస్. కానీ ఇవన్నీ అసరాలు.. ఉపాది కాదంటున్నారు సిపిఎం ఇల్లందు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి దుగ్గి కృష్ణ. నేటి యువత, ప్రజలకు కావాల్సింది ఉపాధి.. ధరల అదుపు.. అని అంటున్నారు. ఇవన్నీ ఎన్నికల ప్రచారంలోకి వెళ్లినప్పుడు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికార పక్షాన్ని నిలదీయడానికి సిపిఎం అభ్యర్థుల అవసరాన్ని గుర్తిస్తున్నారు. ఓటు వేయడానికి ముందుకు వస్తున్నారని దుగ్గి కృష్ణ తెలిపారు.

కామేపల్లి మండలానికి చెందిన దుగ్గి కృష్ణ.. సిపిఎం నేత, మాజీ ఎమ్మెల్యే కెఎల్ నర్సింహారావు అడుగుజాడల్లో నడుస్తూ ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేస్తున్నారు. అడ్డా కార్మికులు, ఆశాలు, అంగన్‌వాడీలు ఇలా స్కీం వర్కర్లు, కాంట్రాక్టు కార్మికులు ఒకటేమిటి అనేక మంది బడుగు బలహీన తరగతులు, గిరిజన సమస్యలు, పోడు, బస్‌డిపో, మున్సిపాలిటీ, మండలాలు, గ్రామాలు, తండాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు ఇలా చెప్పుకుంటూపోతే అనేక సమస్యలపై సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. ఇల్లందు, కామేపల్లి, టేకులపల్లి, గార్ల, బయ్యారం మండలాల్లోని పలు గ్రామాలు, తండాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

'ధరణి' ఫెయిల్ అని రాష్ట్ర ప్రభుత్వమే చెప్పింది

- బిసిలు రాజ్యాధికారం చేపట్టాలి
- నీళ్లు, నిధులు, నియామకాల సాధనే లక్ష్యం
- ఎన్నికల ప్రచార సభల్లో జనసేన అధినేత పవన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కెసిఆర్ ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ ఫెయిలయిందని ప్రభుత్వమే చెప్పిందని, రైతులకు ఉపయోగం లేని ఈ ధరణిని ఎత్తివేయాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న బిసిలు రాజ్యాధికారం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బిజెపి, జనసేన పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని చెప్పారు. కొత్తగూడెం, సూర్యాపేట ఎన్నికల ప్రచార సభల్లో గురువారం పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు. కొత్తగూడెం సింగరేణి ప్రకాశం స్టేడియంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితోనే ఆంధ్రాలో రౌడీలు, గుండాలను ఎదుర్కొంటున్నానని చెప్పారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని చెప్పారు.

నీళ్లు, నిధులు, నియామకాలు సాధనే జనసేన లక్ష్యం

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పొట్టి శ్రీరాములు సెంటర్‌లో జరిగిన రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ.. నీళ్లు, నియామకాలు, నిధులు సాధనకు జనసేన పాటు పడుతుందని తెలిపారు. నల్లగొండ జిల్లాలో తమ్ముడు సినిమా విజయవంతానికి వచ్చినప్పుడు ఫ్లోరోసిస్ బాధి తులను చూడగానే తన మనసు కలచి వేసిందన్నారు. అదే 2008లో జనసేన పార్టీ స్థాపనకు మూల కారణమైందన్నారు. 2009లో నల్లగొండ జిల్లాలో ఫ్లోరోసిస్ గ్రామాల్లో తిరిగి వాటర్ ప్లాంట్స్ పెట్టేందుకు ముందుకు వస్తే స్థానిక రాజకీయ శక్తులు అడ్డుకున్నా యని విమర్శించారు. తనపై ఎక్కువగా ప్రభావం చూపింది గద్దర్ మాటలేనని పవన్‌కల్యాణ్ చెప్పారు.

ఫిరోజ్ ఖాన్‌కు మద్దతు తెలుపుతున్న టిడిపి నాయకులు

ఎంఐఎం అరాచకాలను అడ్డుకుంటా

- నాంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి ఫిరోజ్ ఖాన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎంఐఎం అరాచకాలను అడ్డుకుంటానని కాంగ్రెస్ పార్టీ నాంపల్లి నియోజకవర్గం అభ్యర్థి ఫిరోజ్ ఖాన్ తెలిపారు. నాంపల్లి నియోజకవర్గం టిడిపి ఇన్ ఛార్జి బాలకిషన్ ఆధ్వర్యంలో ఫిరోజ్‌ఖాన్‌కు టిడిపి నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఫిరోజ్‌ఖాన్ మాట్లాడుతూ బిఆర్ఎస్, బిజెపిల సహకారంతో ఎంఐఎం దోపిడీ, అరాచకాలకు పాల్పడుతున్నదని విమర్శించారు. ఎంఐఎం ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

పి సుశీల గాన మాధుర్యం మరువం

ప్రజాశక్తి - కల్చరల్

పి సుశీల తెలుగు సినీ గాన మాధుర్యం మరువ లేనిదని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ కొని యాడా రు. శ్రుతి లయ ఆర్ట్స్ అకాడమీ సీల్ వెల్ కార్పొరేషన్ సంయుక్త నిర్వహణ లో పద్మభూషణ్ పద్మవిభూషణ్ డాక్టర్ పీ.సుశీల జన్మ దినం తో పాటు పుటపర్తి సాయి బాబా జయంతి నీ పురస్కరించుకొని రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై సినీ పాటలతో పాటు సాయి భజన్స్ గానం చేశారు. ప్రముఖ గాయకులు ఆమని తో పాటు రాజన్ సుభాష్, శ్రీనివాస్,కల్యాణి, శైలజ, రవీంద్ర, రమేష్ తదితరులు మధురమైన పాటలను భక్తి గీతాలను ఆలపించారు అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కోలేటి దామోదర్ పాల్గొని సామాజిక సేవకుడు కళా పోషకుడు పొత్తూరి రంగారావు ను కల్చరల్ ఐకాన్ తో సత్కరించి మాట్లాడారు సమాజ హితం కోసం సాయి తత్వము అవసరం అన్నారు. సుశీల అలపించిన సినీ గీతాలు నేటికీ తెలుగు వారి గుండెల్లో నిలిచి వుంటాయని అవిడ ఆరోగ్యం గా సుదీర్ఘ కాలం జీవించి వుండాలని ఆకాంక్షించారు. రచయిత్రి డాక్టర్ కె.వీ కృష్ణ కుమారి, లంక లక్ష్మీనారాయణ కళా రఫీ,రామచంద్ర,విరూపాక్ష స్వామి,విజయ కుమార్ జగదీష్ తదితరులు తమ అభినందనలు తెలిపారు

సింపుల్ స్కిన్ కేర్ నుంచి వాటర్ బూస్ట్ ఉత్పత్తులు

హైదరాబాద్ : వినియోగదారులకు అద్భుతమైన, నాణ్యమైన ఉత్పత్తులను అందించాలనే ఉద్దేశంతో తాజాగా వాటర్ బూస్ట్ రేంజ్ ఉత్పత్తులను ఆవిష్కరించినట్లు సింపుల్ స్కిన్ కేర్ వెల్లడించింది. ఇవి రోజంతా చర్మానికి స్థిరమైన హైడ్రేషన్‌ను అందిస్తాయని తెలిపింది. ఈ శ్రేనీలో మొత్తం ఉత్పత్తులు ఉన్నాయని పేర్కొంది. ఇవి చర్మానికి మేలు చేస్తాయని పరీక్షల్లో నిరూపించబడ్డాయని తెలిపింది. వీటి ధరలు రూ.399 నుంచి ప్రారంభంమవుతాయని వెల్లడించింది.

ఇనార్బిట్ మాల్‌లో బ్లాక్ ఫ్రైడే సేల్

హైదరాబాద్ : సైబరాబాద్ ఇనార్బిట్ మాల్‌లో నవంబర్ 24 నుండి 26 వరకు భారీ డిస్కౌంట్లను అందిస్తున్నట్లు ఆ సంస్థ తెలిపింది. బ్లాక్ ఫ్రైడే సేల్‌లో భాగంగా దాదాపు 75 కంటే ఎక్కువ బ్రాండ్‌లు 50 శాతం వరకు తగ్గింపును అందిస్తున్నాయని పేర్కొంది. లైఫ్ స్టైల్, షాపర్స్ స్టాప్, మార్క్స్ అండ్ స్పెన్సర్, నైకా లక్స్, అమెరికన్ ఈగిల్, ప్యూమా, మాక్స్ వంటి 75కి పైగా ప్రసిద్ధ బ్రాండ్‌లు వినియోగదారులకు ఆకర్షణీయ ఆఫర్లను అందిస్తున్నాయని పేర్కొంది.

30 నుంచి ఊపిరితిత్తుల వ్యాధులపై జాతీయ సదస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇండియన్ చెస్ట్ సొసైటీ (ఐసిఎస్), నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఛాతీ వైద్యుల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హెచ్ఐసిసిలో నవంబర్ 30 నుంచి డిసెంబర్ 3 వరకు ఊపిరితిత్తుల వ్యాధులపై వార్షిక జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఉస్మానియా మెడికల్ కాలేజీ పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం నరేందర్ సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా 2,500 మంది పాల్గొంటారని తెలిపారు. శ్వాసకోశ వ్యాధుల నిర్ధారణ, నివారణ, నిర్వహణ, చికిత్సలో తాజా పురోగతులపై పరస్పరం అవగాహన పెంచుకోవడం సదస్సు లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి. శ్రీనివాస్, కన్సల్టెంట్ పల్మోనాలజిస్ట్ డాక్టర్ ఎం.రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

కెసిఆర్ దళిత విద్రోహి

- బిఎస్‌పిని గెలిపిస్తే ప్రవీణ్‌కుమారే సిఎం
- పేదల అభివృద్ధికి కృషి
- బిఎస్‌పి జాతీయ అధ్యక్షులు మాయావతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ముఖ్యమంత్రి కెసిఆర్ దళిత ద్రోహిగా పనిచేస్తున్నారని బిఎస్‌పి జాతీయ అధ్యక్షులు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో గురువారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ దళితులను ముఖ్యమంత్రి చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి, తానే ముఖ్యమంత్రి అయ్యారని, తన కుటుంబ సభ్యులను మంత్రులుగా చేసుకున్నారని విమర్శించారు.

పేదల సమస్యలపై బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం కోసం ప్రజలను చైతన్యవంతం చేసేందుకు తన ఐపిఎస్ పదవికి రాజీనామా చేసి బిఎస్‌పి పార్టీలో చేరి పనిచేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై కెసిఆర్ తప్పుడు కేసులు పెట్టారని మండిపడ్డారు. తెలంగాణలో బిఎస్‌పి

పార్టీని గెలిపిస్తే ప్రవీణ్ కుమార్‌ను ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించారు. మండల్ కమిషన్‌ను ఆపింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో బిఎస్‌పి అధికారంలో ఉన్నపుడు భూమిలేని నిరుపేదలకు భూ పంపిణీ చేశామన్నారు. తెలంగాణలో కూడా బిఎస్‌పి అధికారంలోకి వచ్చిన తర్వాత భూ పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. సభలో బిఎస్‌పి జాతీయ కోఆర్డినేటర్ ఎంపి రాంజీ, రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ మంద ప్రభాకర్, బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, పెద్దపెల్లి బిఎస్‌పి అభ్యర్థి దాసరి ఉష, మంథని అభ్యర్థి చల్లా నారాయణరెడ్డి, రామగుండం బిఎస్‌పి అభ్యర్థి అంబటి నరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'మా నాన్నను కొట్టించిన ఎమ్మెల్యే ఓడిపోవాలి'

- పదేళ్ల చిన్నారి బిఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ప్రచారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏదైనా పార్టీ మీద అభిమానం ఉంటే చేతనైనంత ఆర్థిక సహాయం చేస్తారు.. మరికొందరు భోజనం పెట్టి అభిమానం చాటుతారు. కానీ పదేండ్ల చిన్నారి అవతల పార్టీ మీద కోపంతో ఏమీ ఆశించకుండా జోరుగా ప్రచారం చేయడమే కాకుండా ప్రత్యర్థి అభ్యర్థికి రూ.5 వేలు విరాళం కూడా ఇచ్చింది. పాప తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం రామన్నగూడెం తండాకు చెందిన తన్నీరు జ్ఞానప్రసన్న (10) నాగార్జునసాగర్‌లోని ఐపిఎస్ స్కూల్లో 4వ తరగతి చదువుతున్నది. ఆ పాప తండ్రి తన్నీరు సతీష్ తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. అప్పటి నుంచి కెసిఆర్ మీద అభిమానంతో బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేశారు. అలాంటి మా నాన్నను ఎమ్మెల్యే నోముల భగత్ కొట్టించారని తెలిపింది. తండాలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన నాగార్జునసాగర్ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు జయవీర్ దగ్గరికి వెళ్లిన ఆ పాప.. 'మా నాన్నను కొట్టించిన ఎమ్మెల్యే భగత్ ఈ ఎన్నికల్లో ఓడిపోవాలని విన్నవించింది. ఎలాగైనా మీరే గెలవాలి అంటూ కన్నీరు మున్నీరుగా విలపించింది. దాని కోసం తాను దాచుకున్న పాకెట్ మనీ రూ.5 వేలు జయవీర్‌కు ఇచ్చింది'. తన నాన్నను కొట్టినందుకు ఆ చిన్నారి తన మనోవేధనను ధైర్యంగా వ్యక్తం చేయడంతో గ్రామ ప్రజలు అభినందించారు.

ఇపిఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలు అమలు చేయాలి

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు టాప్రా వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలోని ఇపిఎస్-95 పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.తొమ్మిది వేలు అమలు చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ల అసోసియేషన్ (టాప్రా) కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను గురువారం టాప్రా ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రాన్ని సమర్పించింది. దశాబ్దాలుగా పెరగని పెన్షన్‌తో సతమతమవుతున్న ఇపిఎస్-95 పెన్షన్ దారులను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేసింది. కనీస పెన్షన్ రూ.తొమ్మిది వేలకు పెంచి, దానిపై కరువుభత్యం చెల్లించాలని కోరారు. హయ్యర్ పెన్షన్‌పై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలనీ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువుభత్యం ప్రకటించిన ప్రతిసారీ ఇపిఎస్-95 పెన్షన్ దారులకూ కరువుభత్యం ప్రకటించాలని సూచించింది. వారికి ఉచిత వైద్య సహాయం అందించాలనీ, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న "ఆసరా" పెన్షన్‌లను ఈపీఎస్-95 పెన్షనర్లకూ ఇవ్వాలని కోరింది. కేరళలో ఇలా అమలవుతున్నదని గుర్తు చేసింది. సీనియర్ సిటిజన్లకు రైలు ప్రయాణంలో రాయితీని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో టాప్రా నాయకులు బాలగంగాధర్, విజయ్ కుమార్, నిరంజన్, అశోక్, రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులు అయోమయం

- అంతుచిక్కని ఓటరు నాడి
- తలపట్టుకుంటున్న లీడర్లు
- అన్ని పార్టీల సభలకూ జనం
- రోజుకోరకంగా మారుతున్న సమీకరణాలు
- సామాజిక తరగతుల వారీగా కేంద్రీకరణ
- ఓట్ల బదిలీపై ఎవరి లెక్కలు వారివే

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో నిలబడ్డ ప్రధాన పార్టీల అభ్యర్థులు అయోమయంలో ఉన్నారు. పైకి గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నప్పటికీ.. సన్నిహితుల దగ్గర తమ బాధను వ్యక్తం చేస్తున్నారు. ఫలానా సామాజిక తరగతి పెద్దలు ఏమనుకుంటున్నారో.. తెలుసుకోవాలని వేగులను పంపుతున్నారు. కానీ ఓటర్లు ఎవరిని కనికరించబో తున్నారన్న విషయం తలపండిన రాజకీయ విశ్లేషకులకూ ఏ మాత్రం అంతుచిక్కటం లేదు. అన్ని పార్టీల సభలకూ జనం వస్తుండటంతో అభ్యర్థులు అయోమయం గందరగోళంలో పడుతున్నారు. లీడర్లు తలపట్టుకుంటున్నారు. గడిచిన పదేళ్లుగా అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీపై పైకి వ్యతిరేకత బాగానే కన్పిస్తున్నా అది విపక్షాలకు ఓట్లుగా బదిలీ అవుతుందా..? లేదా అన్నది ఎవరికీ అంతుపట్టని విషయంగా మారింది. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల మధ్య హోరాహోరీ పోరు అనే అంచనాలు ఉన్నప్పటికీ.. ఆయా నియోజక వర్గాల్లో ఇతర పార్టీల అభ్యర్థులు పోటీ వల్ల ప్రధాన పార్టీలు ఆందోళన చెందుతున్నాయి. వీరి పోటీవల్ల ఎవరికి లాభం? ఎవరికి నష్టం అనే చర్చతో పాటు, గ్రామాల్లో ఏ సామాజిక తరగతి ఓట్లు ఎవరికి వేస్తారో లెక్కలు వేసుకుంటున్నారు. రాష్ట్రంలోని ఆయా నియోజకవర్గాల్లో ఒక్కోచోట ఒక్కోరకమైన సమీకరణలు చోటు చేసుకుంటుండటంతో ఫలాన పార్టీది పైచేయిదిగా ఉండవచ్చని చెప్పలేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డిలోని కొన్ని నియోజకవర్గాల్లో ఈ దఫా ఎన్నిక అత్యంత ప్రతిష్టాత్మకంగా సాగే పరిస్థితులు కన్పిస్తున్నాయి. ఇక్కడ బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు పోటీగా సిపిఎంకు అనూహ్యంగా మద్దతు చేకూరుతున్నట్టు తెలుస్తున్నది.

సామాజిక సమీకరణలపైనే అందరి దృష్టి..

సామాజిక సమీకరణాల మీదనే కాంగ్రెస్, బిఆర్ఎస్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ తరగతుల సమస్యలను పరిష్కరిస్తామంటూ ఆయా నేతలు వాగ్దానాలు చేస్తున్నారు. వారి ఓటు బ్యాంకును తమ వైపునకు తిప్పుకునేందుకు పడరాని పాట్లుపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీకి ఏ కులం ఓట్లు ఎక్కువగా పడుతున్నాయో గమనించి, ఆ తరగతిలో చీలిక తీసుకురావటం ఎలాగనే దానిపై బిఆర్ఎస్ ఎత్తులు వేస్తోందని చర్చించుకుంటున్నారు. ఎబిసిడి వర్గీకరణ, ముస్లిం రిజర్వేషన్లు తదితర అంశాలను తెరమీదకు తీసుకు వస్తున్నారని మాట్లాడుకుంటున్నారు. బిసి ముఖ్యమంత్రి వాగ్దానంతో ఆయా తరగతుల్లో చీలిక తీసుకొచ్చేందుకు బిజెపి ఎత్తులు వేస్తున్నదని తెలుస్తున్నది. మరోపక్క అధికార పార్టీకి ఉపయోగ పడేలాగా ఎంఐఎం పావులు కదుపుతోంది.

పోరాటాలే..ప్రచారాస్త్రాలు..

మరోవైపు రాష్ట్రంలో సిపిఎం 19 స్థానాల్లో తమ అభ్యర్థులను నిలబెట్టింది. ఆయా నియోజక వర్గాల్లో హెూరాహెూరీగా ప్రచారం సాగుతుండటంతో ఈ మూడు పార్టీల మధ్య సమీకరణలు ఎలా ఉండబోతున్నాయన్నది ఇప్పటికిప్పుడే చెప్పలేని పరిస్థితి నెలకొంది. ప్రజల దైనందిన సమస్యలపై నిరంతరం ఆ పార్టీ, ప్రజాసంఘాలు సాగించిన ఉద్యమాలు, పోరాటాలే సిపిఎం అభ్యర్థులు, నేతలు ప్రచారాస్త్రాలుగా ఎంచుకుంటున్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తున్నారు. రాష్ట్రంలో బిజెపి అభ్యర్థులు ఏ ఒక్కరూ గెలవటానికి వీలు లేకుండా తగిన విధంగా రాజకీయ ఎత్తుగడలతో పావులు కదుపుతున్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద చర్యలు, తద్వారా ప్రజల మధ్య అనైక్యత, దేశ సమగ్రతకు వాటిల్లబోయే ప్రమాదాన్ని ఈ సాధారణ ఎన్నికలకు రాజకీయ ప్రచార వేదికలుగా ఉపయోగించుకుంటున్నారు. రాష్ట్రంలో మైనార్టీ, దళిత, గిరిజన ఓటర్ల మొగ్గు ఎటువైపు ఉంటుందన్నది అత్యంత కీలకంగా మారింది. వాస్తవానికి ఈ సామాజికవర్గ ఓటర్లు గడిచిన రెండు ఎన్నికల్లో బిఆర్ఎస్ వైపు నిలుస్తూ వచ్చారు. కానీ ఈ దఫా చీలకవచ్చే పరిస్థితి స్పష్టంగా కన్పిస్తోంది. అయితే మొత్తం సమీకరణలను పరిగణలోకి తీసుకున్నప్పుడు బీజేపీకి లబ్ధి చేకూరే అవకాశాలున్నచోట మాత్రం మైనార్టీ ఓటర్లు ఏకీకృతం అయి అక్కడ ఆ పార్టీని ఓడించగలిగే శక్తి వైపు మొగ్గే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

ఈ ఆరు రోజులు కీలకం..

ఎన్నికల పర్వంలో రాబోయే ఆరు రోజులు అత్యంత కీలక సమయం అని చెప్పక తప్పదు. ఇప్పటికే ప్రచారంలో నువ్వా.. నేనా అన్నట్టు తలపడుతున్న రాజకీయపార్టీలు రాబోయే ఆరు రోజుల్లో సామాజిక సమీకరణలు సమూలంగా మార్చివేసే అవకాశాలు మెండుగా ఉంటాయని తెలుస్తున్నది. ముఖ్యంగా ఈ నెల 25 నుంచి 30 తేదీల మధ్య సానుకూల ప్రతికూల ఓటింగ్ సమీకరణలు పూర్తిగా మారిపోయే పరిస్థితులు ఉండవచ్చని భావిస్తున్నారు. అధికారపార్టీ, కాంగ్రెస్ పార్టీల మధ్య మ్యానిఫెస్టో వార్ తారాస్థాయికి చేరిన దరిమిలా ఓటర్లను ఏ పార్టీ ఆకట్టుకోగలిగితే ఆ పార్టీ వైపు సమీకరణలు మారే అవకాశం ఉందని చెబుతున్నారు. ముఖ్యంగా చివరి రెండ్రోజుల్లో అభ్యర్థులు ఇచ్చే తాయిలాలు ఓటర్లను ప్రభావితం చేయవచ్చని అంచనా. ఈ నేపథ్యంలో ఈ ఆరు రోజులు అన్ని పార్టీలకు అత్యంత కీలకం అని చెప్పాలి.